క్లుప్తంగా

22న టార్గెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 22న టార్గెట్‌బాల్ క్రీడల కోసం పురుషులు, మహిళల జట్ల ఎంపికను నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా టార్గెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఉమాశంకర్, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 15, 16 తేదీల్లో కరీనగర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఆసక్తిగల 17ఏళ్లు పైబడిన వారు 22న కోయిల్‌కొండలో నిర్వహించే ఎంపికకు బోనఫైడ్, ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని కోరారు.

అంగన్‌వాడీలో చేర్పించండి

గండీడ్: ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాధిక సూచించారు. బుధవారం గొల్లగడ్డ, వెన్నాచేడ్‌లో అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించడం ద్వారా పౌష్టికాహారం అందుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

23న ఆత్మీయ సమ్మేళనం

అడ్డాకుల: ఈనెల 23న మూసాపేట మండలానికి సంబంధించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని జానంపేట శివారులోని విభా ఆగ్రో సీడ్స్ కంపెనీ వద్ద నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్ తెలిపారు. బుధవారం ఆయన నిజాలాపూర్‌లో ఇంటింటికీ తిరుగుతూ ఆత్మీయ సమ్మేళనానికి అధిక సంఖ్యలో తరలి రావాలని సర్పంచ్ సత్యమ్మతో కలిసి ప్రచారం చేశారు. దీనికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అదేవిధంగా చక్రాపూర్, పోల్కంపల్లి, జానంపేట, మూసాపేట తదితర గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ప్రచారం చేపట్టారు.

పగిడ్యాల్‌లో కంటి వెలుగు శిబిరం

గండీడ్: మండలంలోని పగిడ్యాల్‌లో బుధవారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ రాణి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విజయలక్ష్మి, డాక్టర్ నవాజ్, వైద్య సిబ్బంది బసప్పచారి, పద్మజ పాల్గొన్నారు.

రోటరిక్లబ్ సేవలు అభినందనీయం

మిడ్జిల్: మండలంలోని వస్పుల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంక్షేమం కోసం హైదరాబాద్‌కు చెందిన రోటరి క్లబ్ ఆధ్వర్యంలో రూ.3లక్షల 10వేలతో వివిధ పనులు చేపట్టడంపై బుధవారం క్లబ్ నిర్వాకులను పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థుల సంక్షేమం కోసం రోటరిక్లబ్ గ్రామీణ ప్రాంతాల పాఠశాలలను అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్, రాజశేఖర్ రెడ్డి, అధ్యక్షుడు పవన్‌కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

మల్లమ్మ కుంట పరిశీలన



అడ్డాకుల: మూసాపేట మండలం చక్రాపూర్ శివారులోని మల్లమ్మ కుంటను బుధవారం నీటిపారుదల శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ చందునాయక్ పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతు రామారావు పొలంలో ఉన్న మల్లమ్మ కుంట వద్ద అలుగును ధ్వంసం చేయడంతో పాటు కట్టను చదును చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తూ ముదిరాజ్ సంఘం నాయకులు ఇటీవల నీటిపారుదలశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. కుంట చుట్టూ కంచె ఏర్పాటు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల తాము కుంటలో చేపలు పట్టడానికి వెళ్లే అవకాశం ఉండదని, అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో కుంటను పరిశీలించిన వర్క్ ఇన్‌స్పెక్టర్ చందునాయక్ దీనిపై మూసాపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ముదిరాజ్ సంఘం నాయకులకు సూచించారు. తమ శాఖ ద్వారా పోలీసులకు లేఖ రాస్తామని తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు అంజనేయులు, రాములు, సాయిలు, లక్ష్మీనారాయణ, తిరుపతయ్య, రఘురాములు ఉన్నారు.

మృతుల కళ్లు దానం

మహబూబ్‌నగర్ రూరల్: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులు వారు చనిపోయినా వారి కళ్లు మరో ఇద్దరికి చూపు నివ్వాలనే ఉద్దేశంతో కళ్లను దానం చేశారు. మండలంలోని బొక్కలోనిపల్లి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మణికొండకు చెందిన ఈర్ల గణేష్, సిద్రమోని రాములు మృతిచెందగా, వారి కళ్లను హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు.

బాలిక అదృశ్యం

చిన్నచింతకుంట: మండలంలోని పర్దీపురానికి చెందిన మైనర్ బాలిక కనిపించడం లేదని తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. మండలంలోని పర్దీపురానికి చెందిన మైనర్ బాలిక సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని, ఎక్కడ వెతికినా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మోహన్‌బాబు తెలిపారు.

మొక్కలు సిద్ధం చేయండి



కాకర్లపహాడ్‌లో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు



పెద్దాయపల్లిలో మొక్కలకు నీరు పడుతున్న జెడ్పీ సీఈఓ జ్యోతి

బాలానగర్: హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు సిద్ధం చేయాలని జెడ్పీ సీఈఓ జ్యోతి ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో నర్సరీల్లో మొక్కల నిర్వహణ, వాటరింగ్‌ను బుధవారం జెడ్పీ సీఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మొక్కలకు నీరు పట్టి నర్సరీల్లో పిచ్చి మొక్కలు పెరగకుండా చర్యలు చేపట్టాలని, ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో వాటరింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ కృష్ణారావు, ఎంపీఓ రాజశేఖర్ రెడ్డిని ఆదేశించారు.

బాలానగర్: మండలంలో ఉపాధి హామీ పథకం పనుల అమలు తీరుపై మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ కృష్ణారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. కూలీల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ, తాగునీటి వసతి, టెంట్ల ఏర్పాటు వంటి అంశాలపై వివరించారు.

బాలానగర్: మండలంలో ఉపాధి హామీ పనులపై ప్రత్యేకాధికారి బాబురావు ఎంపీడీఓ కృష్ణారావుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. కూలీల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ, తాగునీటి ఏర్పాటు, టెంట్ల ఏర్పాటు అంశాలపై సమీక్షించారు. అంతకుముందు మాచారంలో కంటి వెలుగు కార్యాక్రమాన్ని పరిశీలించారు.

మిడ్జిల్: మండల పరిషత్ 2023–2024 బడ్జెట్ యాక్షన్ ప్లాన్‌పై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుదర్శన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా నిధుల కేటాయింపుపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎంపీఓ అనురాధ, వైస్ ఎంపీపీ తిరుపతమ్మ, ఎంపీటీసీలు గౌస్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: హరితహారానికి మొక్కలు సిద్ధం చేయాలని ఏపీడీ శ్రీపాద్ సూచించారు. బుధవారం మండలంలోని కాకర్లపహాడ్, యన్మన్‌గండ్ల, రుద్రారం నర్సరీలను ఆయన మండల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సదర్భంగా ఏపీడీ మాట్లాడుతూ నర్సరీలు ప్రణాళిక ప్రకారం మొక్కలు సిద్ధం చేయాలని సూచించారు. మండలంలో కొనసాగుతున్న ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను మరింత పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీలత, ఈఓపీఆర్‌డీ బద్రునాయక్, ఏపీఓ జ్యోతి తదితరులు ఉన్నారు.

ప్రజలకు ఇబ్బందులు రానీయొద్దు..

హన్వాద: గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత కారణంగా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందని, సర్పంచ్‌లను సమన్వయం చేసుకుంటూ ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. మిషన్ భగీరథ నీరు ఎక్కడైనా రానట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఉపాధి పనులు పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. కూలీల సంఖ్య పెరిగేలా పనులు పూర్తిస్థాయిలో కొనసాగించాలన్నారు. సమావేశంలో శంకర్‌నాయక్, ఏపీఓ హరిశ్చంద్రుడు పాల్గొన్నారు.

రక్షణ చట్టం అమలు చేయాలి

పాలమూరు: రాష్ట్రంలో న్యాయవాదులపై జరుగుతున్న దాడులను నియంత్రించాలంటే న్యాయవాదుల రక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ కోర్టులో న్యాయవాది రవీందర్‌రెడ్డి జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. దాడులను కట్టడి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయ వాద రక్షణ చట్టం తీసుకువచ్చి కఠినంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామనాథ్ గౌడ్, వీర బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మహబూబ్‌నగర్ క్రీడలు: యోగా, వాకింగ్ చేస్తే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని సుప్రభాత్ హెల్త్ క్లబ్ కన్వీనర్ జి.పాండురంగం అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర కళాశాల కేసీఆర్ మైదానంలో బుధవారం పాండురంగం నడక–యోగాపై అవగాహన కల్పించారు.

ఫిల్టర్ ఇసుక దందాను నిరోధించండి

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని కోటకదిర, ఓబ్లాయిపల్లి గ్రామాల్లో గల వాగుల్లో ఫిల్టర్ ఇసుక దందాను నిరోధించి రైతుల పంట పొలాలను కాపాడాలని కాంగ్రెస్ నాయకులు బుధవారం కలెక్టర్ రవినాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కొందరు అక్రమార్కులు వాగులను అడ్డాగా చేసుకొని అక్రమంగా ఫిల్టర్ ఇసుకను తయారు చేసి విక్రయిస్తుండటం వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్ తగిన చర్యలు తీసుకొని చెక్‌డ్యాంల పునర్నిర్మాణానికి చర్యలు చేపడతామని చెప్పారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

జడ్చర్ల టౌన్: వీఓఏల న్యాయపరమైన డిమాండ్లు ప్రభుత్వం తీర్చాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిరవదిక సమ్మె చేస్తున్న వీఓఏలకు ఆయన సంఘీభావం తెలిపారు. మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా వీఓఏలు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వడంతో పాటు పనిభారం తగ్గించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గుర్తింపుకార్డులు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్, రాష్ట్ర కోశాధికారి వసియాబేగం, కృష్ణయ్య, రమేష్, రాథోడ్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

మహమ్మదాబాద్: మండల కేంద్రానికి చెందిన మనోళ్ల నరేందర్ గౌడ్ కొన్ని రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయన కుటుంబానికి స్నేహితులంతా కలిసి బుధవారం రూ.41వేల ఆర్థికసాయం అందించారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

మహబూబ్‌నగర్ రూరల్: తెలంగాణ మాల మహానాడు ఆధ్వర్యంలో దళితరత్న అవార్డు గ్రహీతలను ఘనంగా సన్మానించారు. బుధవారం మాల మహానాడు జిల్లా కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి నర్సింహయ్య అవార్డు గ్రహీతలు చలపతి, రాఘవేందర్, శివకుమార్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, నాయకులు శ్యామ్‌సుందర్, మహేష్, బాలకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

మహమ్మదాబాద్: వచ్చే రోజులన్నీ కాంగ్రెస్‌వేనని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని కంచన్‌పల్లికి చెందిన సురేందర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. నెల రోజుల కిందట ఆయన ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ చేరారు. తిరిగి మళ్లీ తన సొంతగూటికి చేరుతున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేఎం నారాయణ, టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాములు, ఎంపీటీసీ లక్ష్మి, ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని మసీదులో ముస్లింలకు ఎంపీటీసీ రోజాజగన్, విక్రమ్‌గౌడ్ ఇచ్చిన ఇఫ్తార్‌లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కె.శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నవాబుపేట: మండలంలోని చౌడూర్‌లో బుధవారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వేణుగోపాల్ యాదవ్ ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. చౌడూర్, రంగంపల్లి, కాకర్‌జాల్ గ్రామాలకు చెందిన ముస్లింలు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఉపవాసదీక్షలు విరమించారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



శివువును పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి యాదయ్య

నవాబుపేట: ఆస్పత్రిలో పుట్టిన చిన్నారుల పట్ల సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి యాదయ్య సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో చిన్నారులు, బాలింతలను ఆయన పరిశీలించి అందిస్తున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ప్రసవానికి వచ్చిన గర్భిణులను కారణాలు చెప్పి జిల్లా ఆస్పత్రికి తరలించకుండా ఇక్కడే ప్రసవం చేసేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మండలంలోని కారుకొండ సబ్‌సెంటర్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ నవీన్, వైద్య సిబ్బంది శ్రీనివాస్, శకుంతల, శరభలింగం, రాఘవేందర్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో కార్యదర్శుల నిరసన



గండేడ్‌లో నిరసన తెలుపుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

గండేడ్: రెగ్యులరైజేషన్ చేయాలని పంచాయతీ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలతో బుధవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. విధుల్లో చేరి నాలుగేళ్ల ప్రొహిబేషనరీ పిరియడ్ పూర్తి చేసుకున్నా రెగ్యులరైజ్ చేయడం లేదని ఆరోపించారు. వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

నవాబుపేట: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నల్ల దుస్తులు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బుచ్చన్న, నర్మద, నర్సింహులు, శాంతిప్రియ, నరేష్, రాజేష్, అనుష, రాధ, విజయలక్ష్మి, క్రాంతి, కల్యాణి, సాయినాథ్ ఉన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లాలో ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి కొనుగోలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మోహన్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని మాచన్‌పల్లిలో రైతులు కల్లాలు, రోడ్ల వెంట ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని మధ్య దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేయడం వల్ల రైతులకు తీవ్ర నష్టం చేకూరుతుందని అన్నారు. క్వింటాలుకు రూ.3,500లు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు హన్మంతు, నాయకులు నర్సిములు, మొగులయ్య, లక్ష్మీదేవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సోదరభావంతో మెలగాలి



జిల్లా కేంద్రంలో మార్కెట్ చైర్మన్‌కు ఖజూర్ తినిపిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

స్టేషన్ మహబూబ్‌నగర్: పండుగలను సోదరాభావంతో కలిసి మెలిసి జరుపుకోవాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జామియా మసీదులో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ముస్లింలకు ఖజూర్ తినిపించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని అన్నారు. ఇఫ్తార్ మతసామరస్యానికి, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తున్నాయని అన్నారు. తిమ్మసానిపల్లిలోని మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ రహెమాన్, మసీదు కమిటీ అధ్యక్షుడు అహ్మద్ అలీ సనా, కార్యదర్శి జకీ, రహమాన్ రీగల్, నూరుల్ హసన్, మోసీన్‌ఖాన్, సమద్‌ఖాన్ పాల్గొన్నారు.

సేవాలాల్ ఆలయం పరిశీలన..

బాలానగర్: మండలంలోని పెద్దాయపల్లి గ్రామ ముఖ్య కూడలిలోని సేవాలాల్ మహరాజ్ ఆలయాన్ని మంత్రి శ్రీనివాస్ గౌడ్ బుధవారం సందర్శించారు. మండల అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై గిరిజన కోఆపరేటివ్ చైర్మన్ వాల్యానాయక్, వైస్ ఎంపీపీ వెంకటచారితో చర్చించారు. కార్యక్రమంలో ఆచారి, మోహన్‌నాయక్ ఉన్నారు.

జడ్చర్ల: పట్టణంలోని చంద్రాగార్డెన్‌లో బుధవారం ముస్లింలకు ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. హిందూ, ముస్లింలు సోదరభావంతో పండుగలు చేసుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మార్కెట్‌యార్డు చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, మార్కెట్ వైస్ చైర్మన్ దానీష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమానికి కృషి..

భూత్పూర్: ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి భూత్పూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌తో కలిసి పండ్లు తినిపించి ఉపవాస దీక్ష విరమింపజేశారు. కార్యక్రమంలో చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, కోఆప్షన్ అజీజ్, నాయకులు నారాయణ గౌడ్ పాల్గొన్నారు.

దేవరకద్ర రూరల్: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలనే మన ఊరు–మన బడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. బొల్లారంలో రూ.48.63లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం కౌకుంట్ల మండల కేంద్రంలో 32మంది లబ్ధిదారులకు కల్యాణిలక్ష్మి చెక్కులను అందజేశారు. రంజాన్ సందర్భంగా మైనార్టీలకు కిట్లను పంపిణీ చేశారు.



జడ్చర్లలో ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు



భూత్పూర్‌లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

ఎల్‌ఓసీ అందజేత

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మండలంలోని ధర్మాపూర్‌కు చెందిన వెంకటయ్యకు మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాన్ని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ బాధితునికి బుధవారం అందజేశారు. హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రూ.2.5లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాంలక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆయూష్ సేవలు సద్వినియోగం చేసుకోండి

అడ్డాకుల: ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులను సైతం నయం చేసే అవకాశం ఉన్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయుర్వేద డాక్టర్ కె.లావణ్య సూచించారు. మండలంలోని శాఖాపూర్‌లో బుధవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. అనంతరం ఆయూష కరదీపికలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. కీళ్ల, చర్మ వ్యాధులు, మహిళలు, బాలికల ఆరోగ్య సమస్యలకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు జయన్నగౌడ్, ఉపసర్పంచ్ రామకృష్ణ, గ్రామస్తులు యాదయ్య పాల్గొన్నారు.

మండలం కోసం మౌన దీక్ష

కోయిల్‌కొండ: మండలంలో 44 గ్రామ పంచాయతీలుగా ఉన్న కోయిల్‌కొండను రెండో మండలంగా గార్లపహాడ్‌ను ఏర్పాటు చేయాలని మండల సాధన సమితి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల ప్రజలు బుధవారం మౌనదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో తొమ్మిది చిన్న, చిన్న గ్రామాలతో ఎర్రవల్లిని మండలంగా ప్రకటించిన ప్రభుత్వం, అతిపెద్ద మండలమైన కోయిల్‌కొండను రెండు మండలాలుగా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. 88రోజులుగా దీక్షలు చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఆంజనేయులు, వెంకటేష్, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

కరాటే బెల్టు పరీక్షలు

జడ్చర్ల టౌన్: మండల కేంద్రంలోని గీతాశ్రీ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మాస్టర్ జాకీర్ ఆధ్వర్యంలో బెల్టు పరీక్షలు నిర్వహించి బెల్టులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో జీకే షోటోఖాన్ కరాటే క్లబ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఇలియాస్ బిన్ సిద్ధిఖీ, హెచ్‌ఎం బాల్‌రాజ్ పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

అడ్డాకుల: మొబైల్ ఫోన్లకు వచ్చే కొత్త లింకులను ఓపెన్ చేసి సైబర్ మోసాలకు ఎవరూ గురి కావొద్దని భూత్పూర్ సీఐ రజితారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం సైబర్ నేరాలపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మొబైల్ ఫోన్లకు వచ్చే ఓటీపీలను ఎవరితోనూ షేర్ చేసుకోవద్దని సూచించారు. మహిళలు, బాలికల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. నకిలీ విత్తనాల విషయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలని, విత్తనాల విషయంలో అనుమానం వస్తే పోలీసులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మాధవరెడ్డి, మాజీ ఎంపీటీసీ భీమన్నయాదవ్ ఉన్నారు.

చిన్నచింతకుంట: మండలంలోని పర్దీపురంలో సురక్ష పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో సామాజిక రుగ్మతలు, సాంఘిక దురాచారాలు, మూఢ నమ్మకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మోహన్‌బాబు, సర్పంచ్ సుప్రియ తదతరులు ఉన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేత



మహబూబ్‌నగర్ క్రైం: మిడ్జిల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ మృతిచెందిన కానిస్టేబుల్ విజయ్‌కుమార్ భార్య కృష్ణవేణికి పోలీస్ శాఖ నుంచి ఇవ్వనున్న రూ.8లక్షల భద్రత చెక్కును బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కె.నరసింహ అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు టి.మహేష్, మధు, ఏఓ రుక్మిణి పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

గండేడ్: గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా పకడ్బందీగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని మిషన్ భగీరథ ఈఈ పుల్లారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెన్నాచేడ్‌లో 525 కేఎల్ నీటి డిమాండ్ ఉండగా, కేవలం 300 కేఎల్ నీరు మాత్రమే వస్తుందని సర్పంచ్ పుల్లారెడ్డి అధికారులకు తెలిపారు. మొత్తం ట్యాంకులు నిండడం లేదని, పెద్ద చెరువులో ఉన్న బోర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు వివరించారు. మోడల్ స్కూల్‌లో ఉన్న 150 కేఎల్ వాటర్ ట్యాంకుకు నీరు మొత్తంగా రావడం లేదని తెలిపారు. ఇందుకు ఈఈ స్పందిస్తూ మోడల్ స్కూల్‌లో సంపు నింపుకొని అక్కడ నుంచి మోటారు ద్వారా ట్యాంకుకు ఎక్కించాలని సూచించారు. నీటి సరఫరాలో సిబ్బంది నిర్లక్ష్యం వహించరాని హెచ్చరించారు. దీంతో పాటు మిగతా కనెక్షన్లు, లీకేజీలు వెంటనే మరమ్మతు చేయించేలా చూడాలని ఏఈ అనిల్‌కుమార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈ తేజ్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గణేష్, పీఏసీఎస్ డైరెక్టర్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలను అరికడదాం

జడ్చర్ల టౌన్: అగ్నిప్రమాదాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఫైర్ అధికారి మల్లికార్జున్ పిలుపునిచ్చారు. అగ్నిమాపక దళ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక మిడ్లాండ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యార్థులు, సిబ్బందికి అగ్నిప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. వేసవికాలం కావడంతో బావులు, చెరువులు, స్విమ్మింగ్ పూల్ ప్రాంతాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, డీఓపీలు వెంకటయ్య, రమేష్, నవీన్‌కుమార్, రవికుమార్ పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం అధికారి శ్రీనివాసరావు, సిబ్బంది సంజీవరెడ్డి పాల్గొన్నారు.

డెంగీ కేసు నమోదు

మిడ్జిల్: మండలంలోని దోనూర్‌కు చెందిన నర్సమ్మ(50)కు బుధవారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో డెంగీ కేసు నమోదు కావడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమై గ్రామంలో పారిశుద్ధ్య పనులను చేపట్టారు. జిల్లా కేంద్రంలోని మలేరియా కార్యాలయం నుంచి వచ్చిన అధికారితో కలిసి మండల వైద్య సిబ్బంది గ్రామంలో డోర్‌టూ డోర్ తిరిగి నిల్వ నీటిని తొలగించారు. అలాగే కెమికల్స్‌తో గ్రామంలో పిచికారీ చేయించారు. కార్యక్రమంలో జానకిరాముడు, సీహెచ్‌ఓ రామ్, హెల్ అసిస్టెంట్లు దేవయ్య, జంగయ్య, ఆశా కార్యకర్తలు బాలమణి, శిరీష పాల్గొన్నారు.